ప్రజాశక్తి

ఆదివారం 9 మార్చి 2025 | 5 | అనంతపురం





మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

జాతి మనుగడకు సమానత్వం ముఖ్యం - జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి - అనంతపురం

కక్షిదారులు రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా జిడ్జి జి.శ్రీనివాస్ తెలిపారు. అనంతపురం నగరంలోని జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకుని రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇక జాతి మనుగడకు స్త్రీ, పురుష సమానత్వం ముఖ్యమన్నారు. భూదేవికి ఉన్నంత ఓర్పు, సహనం మహిళలకు ఉంటుందని తెలిపారు. కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళలకు జిల్లా యంత్రాంగం సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్ ఐ ఆసుపత్రి, అక్బర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డా॥బాలాకుమారి, డా॥ప్రసూన, డా॥మాధవి, డా॥పవిత్ర, డా॥మాధుర్య, డా॥రాణి ఐశ్వర్య, డా॥అక్బర్, డా॥శివ ప్రకాష్ రావు, డా॥మహమ్మద్ ఆరిఫ్‌తో పాటు జ్యుడీషియల్ అధికారులు, మహిళలను జిల్లా జడ్జి, కలెక్టర్ సన్మానించారు. వీరితో పాటు ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి సత్యవాణి, బార్ ప్రెసిడెంట్ గురుప్రసాద్, బార్ కౌన్సిల్ మెంబర్ రామ్ రెడ్డి, మహిళా కోర్టు జడ్జి శోభారాణి, పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సాదుబాబు, సీనియర్ సివిల్ జడ్జి నిర్మల, ఎక్సైజ్ కోర్టు జడ్జి పావని, మొబైల్ కోర్టు జడ్జి సుధీర్ కుమార్, స్పెషల్ మెజిస్ట్రేట్ సుబ్బారావు, శివశంకర్, రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి రమ్య, కన్జ్యూమర్ ఫోరం ప్రెసిడెంట్ శ్రీలత, కన్స్యూమర్ ఫోరం సభ్యురాలు గ్రేస్ మేరీ, సీనియర్ అడ్వకేట్ పద్మజ, జ్యుడీషియల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, కోర్టు మేనేజర్ మాధవిలత, తదితరులను సన్మానించారు.



పాదయాత్ర సందర్భంగా మిర్చిరైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

నష్టాలే మిగులు..!

- పాదయాత్ర బృందం ముందు రైతుల ఆవేదన
- రెండవ రోజు కొనసాగిన రైతు సంఘం పాదయాత్ర
- స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలి
- రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆరుగాలం కష్టపడి పంటలు పండినా నష్టాలే మిగులు ఉంటున్నాయని రైతుసంఘం నాయకుల ఎదుట రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర జల్లిపల్లి మీదుగా సాయంత్రానికి ముద్దలాపురం గ్రామం చేరుకుంది. ఈ సందర్భంగా మార్గమధ్యంలో పంట పొలాలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. అదే సందర్భంలో రైతులతోనూ సమస్యలు వింటూ ముందుకుసాగారు. కొన్ని చోట్ల రైతులు తమ కష్టాలను పాదయాత్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. జల్లిపల్లి గ్రామంలో మహిళా రైతు లక్ష్మిదేవి మాట్లాడుతూ రూ.20 లక్షలు ఖర్చుపెట్టి మూడు కిలోమీటర్లు పైపులైన్ వేసుకుని ఆరు ఎకరాల్లో పంటలు సాగు చేసినా నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఏడాది వేరుశనగ పంట వేస్తే రూ.1.50 లక్షల నష్టమెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిరప రైతులు కూడా గిట్టుబాటు ధర లేదని పాదయాత్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు.

స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి
ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్

రైతులు పండించిన పంటలకు స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటు చేసి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. పాదయాత్ర సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో అత్యధికంగా వేరుశనగ పంట సాగవుతున్నా స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతులు అటు బళ్లారిగానీ, ఇటు కర్నూలు జిల్లాకుగానీ పంటను తీసుకెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అక్కడికెళ్లాక వ్యాపారులు నిర్ణయించిన ధరకు అమ్ముకునే పరిస్థితులున్నాయన్నారు. ఉరవకొండ ప్రాంతంలో అత్యధికంగా పండేది మిరప పంటని ఈ పంట పరిస్థితి అదే రకంగా ఉందని తెలిపారు. మిరప పంటను అమ్ముకోవాలంటే కర్నాటక రాష్ట్రానికి రైతులు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఒకవైపు ప్రభుత్వం హార్టికల్చర్ హబ్ చేస్తామని ప్రకటనలు చేస్తున్నా, ఆచరణలో రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించలేకపోతోందని విమర్శించారు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో పంట పండినా రైతుకు నష్టమే మిగులుతోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి మధు, సిఐటియు నాయకుడు వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో మహిళా రైతుతో మాట్లాడుతున్న రాంభూపాల్

మాజీ ఎమ్మెల్సీ డా॥ గేయానంద్ మద్దతు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఎపి రైతు సంఘం చేపట్టిన పాదయాత్రకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మద్దతు తెలిపారు. ఈయనతోపాటు మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా మద్దతు తెలిపిన వారిలోనున్నారు. ముద్దలాపురం గ్రామం వద్ద పాదయాత్ర బందాన్ని కలసి మద్దతు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం చేపట్టిన పాదయాత్రకు ప్రభుత్వం స్పందించాలని కోరారు. లక్షలు ఖర్చు పెట్టి రైతులు పంటలు పండిస్తే సరైన గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరకు పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసు జాగిలం సేవలు మరువలేనివి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



జాగిలాన్ని సన్మానించిన పోలీసులు

పోలీసు జాగిలం 'డాలీ' జిల్లా పోలీసు శాఖకు అందజేసిన సేవలు మరువలేనివని ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. 11ఏళ్లుగా జిల్లా పోలీస్ శాఖకు సేవలందించిన డాలీ (జాగిలం) శనివారం పదవీ విరమణ పొందింది. ఇందులో భాగంగా స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో డాలీని ఘనంగా సత్కరించారు. అనంతరం హ్యాండ్లర్ నాగభూషణను అభినందించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2014లో 6 నెలల వయస్సు ఉన్నప్పుడు ఈ జాగిలాన్ని జిల్లాకు కేటాయించారన్నారు. అప్పటి నుంచి హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, తదితర నేరాల ఛేదింపులో క్రియాశీలక పాత్ర పోషించి జిల్లా పోలీసు అధికారులకు తోడ్పడిందన్నారు. దాదాపు 300 పైగా నేరాలు జరిగిన ఘటనా ప్రదేశాల్లో ఈ జాగిలం అటెండ్ అయ్యి చెప్పుకోదగ్గ 30 నేరాల ఛేదింపునకు సహకరించిందన్నారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్‌బాషా, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్‌ఐలు మధు, బాబు, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు, లక్ష్మీనారాయణ, ఆర్ఎస్‌ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్‌నాయక్, బాబ్జాన్ , డాగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జి సూర్యనారాయణ, హ్యాండ్లర్ నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

నయా ఫాసిస్టు లక్షణాలున్న బిజెపిని కట్టడి చేయాలి

- పెట్టుబడిదారీ వ్యవస్థలోనే సంక్షోభముంది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్
- 'వర్తమాన రాజకీయాలు- సిపిఎం వైఖరి'పై అనంతలో సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నయా ఫాసిస్టు లక్షణాలు కలిగున్న బిజెపిని కట్టడి చేయాల్సిన అవసరముందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో శనివారం సాయంత్రం సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అధ్యక్షతన 'వర్తమాన రాజకీయాలు- సిపిఎం వైఖరి' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంభూపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిపిఎం 24వ మహాసభ రాజకీయ తీర్మానం- ముసాయిదాపైనా వివరించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సిపిఎం నిర్వహించే మహాసభల సందర్భంగా రాజకీయ ముసాయిదాను బహిర్గతం చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆ ముసాయిదాపై అభిప్రాయలను ప్రజలందరూ లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చునని చెప్పారు. వాటన్నింటిని పరిశీలించి రాబోయే మూడు సంవత్సరాల కాలంలో సిపిఎం అనుసరించబోయే భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ముసాయిదాలో ఉన్న ప్రధానమైన అంశాల గురించి తెలియజేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం అనివార్యమని చెప్పారు. ఇప్పుడు ప్రపంచ గమనాన్ని పరిశీలించినా అది అవగతమవుతుందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థికాభివృద్ధి 3.2 శాతం మాత్రమే ఉందని చెప్పారు. అందులో బ్రిటన్, జపాన్ తదితర పెట్టుబడిదారీ దేశల్లో ఆర్థికాభివృద్ధి పూర్తిగా స్తబ్దతతో ఉందన్నారు. అక్కడ ఒక్క శాతంలోపే అభివృద్ధి ఉందన్నారు. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రపంచ వ్యాప్తంగా మితవాద ప్రభుత్వాలు అధికారంలోకి వస్తుండటం ఆందోళన కలిగించే అంశమని విచారం వ్యక్తం చేశారు. అక్కడక్కడా వామపక్ష భావజాలమున్న ప్రభుత్వాలు ఏర్పడుతుండటం సానుకూలమైన అంశం అని వివరించారు. భారతదేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నయా ఫాసిస్టు లక్షణాల వైపు అడుగులేస్తోందని చెప్పారు. దీన్ని కట్టడి చేయడానికి విశాల ఐక్యతను సాధించేందుకు కృషి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ దిశగా సిపిఎం ప్రయత్నించనుందన్నారు. దేశంలోనూ సామాన్యజనం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అనేక నివేదికలు చెబుతున్నాయన్నారు. 20 కోట్ల మంది వద్ద మాత్రమే తగినంత డబ్బు ఉందన్నారు. 40 కోట్ల మంది అప్పుల ఊబిలో ఉనున్నారన్నారు. వంద కోట్ల మంది వద్ద కనీస అవసరాలకు డబ్బుల్లేవన్నది అనేక నివేదికల ద్వారా స్పష్టమవుతోందన్నారు. ప్రజల ఆదాయాలు పెరగకపోవడం, ధరలు పెరగడంతోనే ఈ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. పెట్టుబడిదారీ విధానంలోనున్న లోపమే ఇదన్నారు. ప్రజలను సమైక్యపరచి ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు సన్నద్ధం చేయాల్సిన అవసరముందని సిపిఎం భావిస్తోందని తెలిపారు.



సదస్సులో ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్

మార్గదర్శకులు మహిళలు

- సమానత్వంతో ముందుకు సాగాలి
- మహిళా దినోత్సవంలో వక్తలు



మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహిళలు ఎందులోనూ ఎవరితోనూ తక్కువ కాదని, అన్ని రంగాల్లో వారు ముందుకు నడుస్తూ సమాజ మార్గదర్శకులుగా నిలుస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. జెఎన్‌టియు ఆడిటోరియంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి శ్రీ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఐసిడిఎస్, సెర్ప్, మెప్మా, పోలీస్, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశీలించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డీఆర్డీఏ, పీఎంఏజెఏవై, స్త్రీ నిధి, పిఎమ్‌ఈజీపి, పిఎం విశ్వకర్మ, స్టాండప్ ఇండియా తదితర వాటి పరిధిలో మంజూరైన చెక్కులను మహిళా లబ్ధిదారులకు అతిథులు అందజేశారు. అనంతరం పలువురు మహిళలు, అధికారిణులను సత్కరించి, సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ మహిళలకు పెద్దపీట వేసే కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతుందన్నారు. దేశానికి రాష్ట్రపతి, ఆర్థిక మంత్రి మహిళలు అని, వారు అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ప్రతి మహిళా ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ మహిళలు అనుకుంటే ఏదైనా సాధించగలరని, తాను మహిళలకు అన్నింటిలో సహకారం అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో మహిళలకు అత్యంత ప్రాధాన్యత దక్కుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోందని తెలియజేశారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, మహిళా సాధికారత, ఆర్థిక అభివద్ధి సాధించాలన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలన్నారు. మహిళలకు జిల్లా యంత్రాంగం తోడుగా ఉంటుందన్నారు. మహిళలపై ఏదైనా నేరం జరిగితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ప్రశాంతి జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ సుశీలమ్మ, డిఆర్ఓ ఎ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి, ఆర్డీవో కేశవ నాయుడుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి మహిళా శక్తిని చూపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



మహిళా దినోత్సవంలో చిన్నారి నృత్యప్రదర్శన

ప్రకాష్‌రెడ్డీ.. నోటికి వచ్చినట్లు మాట్లాడొద్దు..

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్



మాట్లాడుతున్న పరిటాల సునీత


తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. నోటికి వచ్చినట్టు మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి..' అంటూ ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. శనివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించిన 53 మంది బాధితులకు రూ.52.65 లక్షలు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు చెందిన 30 మందికి రూ.33.32లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు కష్టం ఉందంటే క్షణం కూడా ఆలోచించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు సాయం చేస్తున్నారన్నారు. ఇటీవల రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు అడుగుతున్నారని.. దీనిపై సంబంధిత శాఖ మంత్రిని కలిశామని.. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు అందిస్తామన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద తీవ్రంగా స్పందించారు. 'నోరు ఉందని.. చేతిలో సెల్ ఫోన్ ఉందని ఏదిబడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదు..' అని హెచ్చరించారు. గత ఐదేళ్లలో పేరూరు జలాశయంకు నీరందించే ప్రాజెక్టును అటకెక్కించారన్నారు. వర్షపు నీటితో నిండిన ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి వాటిని విరగగొట్టి మొత్తం నీటిని ఏటిపాలు చేసి నేడు నీతివ్యాఖ్యలు చెప్పడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం రోజున ఒక మహిళాగా చెబుతున్నానని.. పేరూరు ప్రాజెక్ట్ గేట్లు మరమ్మతులు చేయించి, ప్రాజెక్టుకు నీరందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు నిర్మిస్తామని చెప్పి.. రాక్రీట్ సంస్థ పేరుతో దోపిడీ చేసింది నిజం కాదా..? అని నిలదీశారు. సొంతింటి కలతో ఉన్న పేదల్ని మోసం చేశారన్నారు. తాము ఇళ్లు లేని ప్రతి నిరుపేదకూ కచ్చితంగా ఇళ్లు ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. నీ అవినీతి లెక్కలు కూడా త్వరలోనే తేలుతాయని హెచ్చరించారు.

సీనియార్టీ జాబితాలో లోపాలను సరిజేయాలి

డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో చోటు చేసుకున్న అసంబద్ధాలు, లోపాలను సరిజేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో కొంతమంది పేర్లు కనపడక పోవడం, టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం డేటాకు భిన్నంగా వివరాలు ఉండటం, సీనియారిటీలో వ్యత్యాసాలు ఉండడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కావున ఉపాధ్యాయుల సీనియారిటి జాబితాలో దొర్లిన అసంబద్ధాలను సరి చేయాలని కోరారు. అలాగే డీఎస్సీల వారీగా హాల్ టికెట్ నెంబర్ వివరాలు.. మార్కులు.. ర్యాంకులు.. రోస్టర్ ర్యాంకులకు సంబంధించి జిల్లా విద్యాశాఖ దగ్గర ఉన్న సమాచారాన్ని డిఇఒ బ్లాక్, వెబ్‌సైట్‌లో ప్రకటించాలన్నారు. ఇకపోతే ఈనెల 3వ శనివారం జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలని కోరారు. ఒంటరి మహిళలకు సంబంధించి రిఫరెన్షియల్ క్యాటగిరి వర్తించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, నాయకులు ఆదిశేషయ్య, పవన్ కుమార్, జాకీర్ హుస్సేన్, గంగాధర్, ఓగులపతి, శివ రుద్రప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

'అనంత' ప్రజలకు మంచినీరు సరఫరా చేయండి

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనతపురంలోని ప్రజలకు సక్రమంగా మంచినీరు సరఫరా చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో కూడేరు ముద్దలాపురంలో ఉన్న మంచినీటి సరఫరా శుద్ధికేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలో నివసిస్తున్న ప్రజలకు నీటి సరఫరా కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టినప్పటికీ ఉపయేగకరంగా లేదన్నారు. నీటి శుద్ధిచేసే పేరుతో అధికారులు, పాలకులు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించగా కొరకొళ్ల డ్యామ్ నుంచి వచ్చిన నీరును పేరుకు మాత్రమే శుద్ధి చేస్తున్నారని, దానిలో ఆలంగాని, క్లోరినేషన్‌గాని సరైన పద్ధతిలో వాడటం లేదన్నారు. గత కొన్నినెలలుగా బిడ్డింగులను శుభ్రం చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన కొత్త భవనాలను ఉపయోగించుకోవడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. పేరుకు మాత్రం మంచి నీరు తప్ప ప్రజలకు ఉపయోగపడే మంచినీరు సరఫరా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి శుద్ధి కేంద్రం బోర్డును కూడా బాగు చేయలేని పరిస్థితిలో పాలకులు ఉన్నారని విమర్శించారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న ప్రజలకు అవసరమైన మంచి నీటిని మాత్రం సరఫరా చేయడం లేదన్నారు. వేసవికాలంలో నీటి శుద్ధి కేంద్రాన్ని పూర్తిగా శుద్ధి చేసి మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు వై.వెంకటనారాయణ, ఎస్.ముత్తుజ, నగర నాయకులు మసూద్, ఓబులేసు, నూరుల్లా, డేవిడ్, రవి, సాయి, నరసింహ, వన్నూరప్ప, ఇస్మాయిల్, అలీ, వెంకటేష్, నాగేంద్ర, రాజు, సీన తదితరులు పాల్గొన్నారు.



మంచినీరు సరఫరా శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-రాప్తాడు

పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని, సర్వీసు బట్టి కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, తొలగించిన వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని, గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు ఇవ్వాలని, యూనిఫాం, బ్లీచింగ్ పౌడర్, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి మహాధర్నా నిర్వహించను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామాంజనేయులు, పంచాయతీ కార్మికులు, లక్ష్మీదేవి, పెద్దక్క, ఓబులమ్మ, పోతలయ్య, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు

శ్రీచైతన్యలో జోనల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని బైపాస్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలల్లో బిఎస్ రావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌ను ఎజిఎం సుబ్బారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిటిసి వీరరాజు, 4వటౌన్ ఎస్ఐ రామ్‌ప్రసాద్, ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బిఎస్.రావు శ్రీచైతన్య పాఠశాలలను స్థాపించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతస్థాయిలో నిలిచేలా చేశారన్నారు. అంతేగాకుండా శ్రీచైతన్య విద్యాసంస్థల ద్వారా అనేకమంది ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారన్నారు. అలాంటి ఆయన మరణానంతరం గుర్తుగా స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు తబస్సుం, సమీనాఖాన్, విశ్వనాథ్, శాంత, నేత్రావతి, పర్వీన్, శ్రీదేవి, మధు, వెంకటేష్, కరీం, మురళీకృష్ణ, నరేష్, ఫిలిప్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, ఇర్షాద్, పూజ, ఎఒ గోపాల్, రీసోర్స్‌పర్సన్ రాజశేఖర్, మధు, జోనల్ పిఇటి విజయ్, పిఇటిలు గాయత్రి, భరత్, అస్లాం, సుహాసిని, శివప్రకాష్, విజయ, రవి, రాజు, మాధవి, రమాదేవి, శంకర్, గోపీచంద్ శిల్ప, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

విద్యార్థులకు 'బ్రాండ్ ప్రమోషన్' కీలకం

హిమాలయ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు

ప్రజాశక్తి అనంతపురం

విద్యార్థులకు బ్రాండ్ ప్రమోషన్ అనేది చాలా కీలకమని హిమాలయ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు అన్నారు. శనివారం స్థానిక అనంత లక్ష్మి కళాశాలలో మూడు రోజులపాలు నిర్వహించనున్న బ్రాండ్ ప్రమోషన్ కార్యక్రమాన్ని ఛైర్మన్ అనంత రాముడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండ్ ప్రమోషన్ మార్కెటింగ్‌లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఎవరైరా భవిష్యత్తులో వ్యాపార ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి అవసర మైన అనుభవాన్ని సంపాదించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రామమూర్తి, వైస్ ఛైర్మన్ ఎం.రమేష్‌నాయుడు, కళాశాల నైపుణ్యాభివృద్ధి సంచాలకులు ఎం.సురేంద్రనాయుడు, ఎంబిఎ, ఎంసిఎ విభాగాధిపతి చక్రధర్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న హిమాలయ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు, అనంత రాముడు

యాడికిలో ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి పర్యటన

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి శనివారం పర్యటించారు. ముందుగా శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బస్టాండ్ సర్కిల్‌లో పండ్ల వ్యాపారులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులతో ముచ్చటించారు. అక్కడి నుంచి తిరుణాల సందర్భంగా కుంటలో ఏర్పాటు చేయనున్న జాయింట్ వీల్, బొమ్మల అంగళ్ల ఏర్పాట్లపై ఆరాతీశారు. తర్వాత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను వీక్షించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆశావర్కర్లతో కలిసి కేక్ కోశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి రంగయ్య, విశ్వం, పరిమి చరణ్, రాజశేఖర్, గండికోట లక్ష్మణ్, తాండ్ర విక్రమ్, తిరంపురం నీలకంఠ, కోడూరు నీలకంఠారెడ్డి, భద్రావతి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చలివేంద్రం ఏర్పాటు

పామిడి : పట్టణంలోని కన్నెమూల విద్య వినాయక సమితి, వస్త్రా వ్యాపారులు సంయుక్తంగా శనివారం మెయిన్ బజార్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆర్‌ఓ నీటితో ప్రతిసారి కూలర్ నింపుతామన్నారు. ఎండాకాలం ముగిసేంత వరకు బాటసారులకు చల్లని నీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి దేవాలయ ధర్మకర్త కె.సాయిప్రకాష్, నారాయణస్వామి, ఓ.బిలేసు, వస్త్ర శ్రీనివాసులు, గణేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ వైద్య విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు

ప్రజాశక్తి-రాయదుర్గం

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెటర్నరీ వైద్య విద్యార్థులు చేపట్టిన దీక్షలకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెటర్నరీ విద్యార్థులు దాదాపు 33 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీనితోనే శాంతియుతంగా పోరాటం చేస్తున్న విద్యార్థులను యూనివర్సిటీ హాస్టల్లో ఉండొద్దని వెళ్లగొట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపకార వేతనాలు రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణం వారి సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

అనంతపురం : నగరంలోని నవభారత్ పాఠశాలలో పదో తరగతి వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించిన పదో తరగతి విద్యార్థులు పరీక్షలను బాగా రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిట్టూరు కృష్ణవేణి, నిట్టూరు అనిత, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నిట్టూరు శశిభూషణ్

లోక్ అదాలత్‌లో 225 కేసులు పరిష్కారం

రాయదుర్గం : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కోర్టులో ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 225 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఎం.శ్రీధర్ తెలిపారు. వీటిలో 25 భారత శిక్షాస్మృతి కేసులు, 187 ఎక్సైజ్ కేసులు, 9 చోరీ కేసులు, ఎంవీ, ఎన్ఐ కేసులు చెరొకటి, ఇతర కేసులు రెండు పరిష్కరించినట్లు తెలిపారు. వాట్లా కేసులకు రూ.52,500 జరిమానా విధించినట్లు వివరించారు. కాగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు పరిధిలో 40 పిటి కేసులు (ఎస్ టి సి) పరిష్కారం కాగా 64,600 జరిమానా విధించబడగా, సీజ్ చేసిన నగదు విలువ 3,18,575 ఉంటుందని తెలిపారు.

10న ఉద్యోగ మేళా

అనంతపురం కలెక్టరేట్ : ఎపి ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీన ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముతూట్ ఫైనాన్స్, ఎల్‌ఐసి ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. కాస్త ఇంటర్ పాస్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయి 20–30ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిట్టుబాటుకై పోరుబాట..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఎపి రైతు సంఘం పోరుబాటను ప్రారంభించింది. ప్రధానంగా మిర్చి పంట ధరలు విపరీతంగా పడిపోయాయి. జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతుంది. అందులో ఆర్థిక మంత్రి ప్రాతినిధ్యం వహించే ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోనే అధికంగా ఉంటుంది. ఇందులో ఎక్కువ మంది కౌలు రైతులుఉండటం గమనార్హం. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి, ప్రకృతి వైపరిత్యాల నుంచి పంటను కాపాడుకుని దిగుబడులు సాధించాక ధరల్లేక రైతు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో మార్కెట్‌కు అమ్ముకుందామని పోయిన రైతులు ధరలేకపోవడంతో కోపోద్రోక్తులై కర్నాటక మార్కెట్ యార్డును తగులబెట్టేందుకు సిద్ధమయ్యారు. అందులో అనేక మంది పోలీసు కేసుల్లోనూ చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. గత అనుభవాన్ని చూసి అయినా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి మేలుకోలేదు. ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని సీజన్ ప్రారంభంలోనే డిఆర్‌సి సమావేశంలోనూ చర్చకొచ్చింది. ప్రభుత్వంలో ఎటువంటి స్పందనా కలుగలేదు. మిర్చి రైతుకు గిట్టుబాటు కల్పించడం తమ చేతుల్లో లేదన్నట్టుగా ఉంటూ వచ్చారు. ఇక రాజకీయంగానూ ఇది పెద్ద చర్చనీయాంశమవుతున్న సమయంలో సేకరిస్తామని ప్రకటించింది. సేకరణలోనూ అనేక షరతులు, నిబంధనలున్నాయి. దీంతో రైతులు ఇప్పటికీ అవస్థలు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎపి రైతుసంఘం పాదయాత్రను ఉరవకొండ నుంచి ప్రారంభించింది. రెండు రోజులుగా రైతులను కలుస్తూ వస్తున్నారు. ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. అంతలోపు ప్రభుత్వం వైపు నుంచి స్పందన వస్తుందా లేదా చూడాల్సి ఉంది. ఇతర పంటల పరిస్థితులు కూడా ఇంచుమించుగా ఇదే రకంగా ఉండటం గమనార్హం. రైతులు గిట్టుబాటు కోసం ప్రభుత్వాలను ప్రాధేయ పడే పరిస్థితులే నెలకొని ఉన్నాయి.

హంద్రీనీవా మొదటి దశ కాలువ వెడల్పు చేయాలని ముందు నుంచి జిల్లావాసులు అడుగుతున్నారు. కాని ప్రభుత్వం మాత్రం వెడల్పు కాకుండా రెండో దశలో లైనింగ్‌కు సిద్ధపడింది. ఇది సరైంది కాదని అటు సిపిఎంతోపాటు, ప్రతిపక్ష వైసిపి నాయకులు కూడా చెబుతున్నారు. లైనింగ్ పనులు చేపట్టడాన్ని నిలిపివేయాలని సూచిస్తున్నారు. లైనింగ్ చేపడితే భూగర్భజలాలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని రైతు శ్రేయోభిలాషులందరూ చెబుతున్నారు. కాని ప్రభుత్వం దీన్ని పెడచెవిన పెట్టే విధంగానే కనిపిస్తోంది. అధికారపార్టీ నేతలు మాత్రం ఈ అంశంపై పెదవి విప్పడం లేదు. సరైందా.. కాదా.. అన్నది కూడా చెప్పకుండా మౌనంగా ఉంటుండటం గమనార్హం.

రాజకీయ అంశాలకు సంబంధించి ఈ వారం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు విజయవాడ పోలీసులు నోటీసులిచ్చారు. దీంతో ఆయన వారి ముందు విచారణకు హాజరయ్యారు. అరెస్టులుండవచ్చునని భావించినా అటువంటిదేమీ జరక్కపోవడంతో వైసిపి శ్రేణులు ఒకింత ఊపిరి పీల్చుకున్నాయి.

'యువత పోరు'ను విజయవంతం చేద్దాం

వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న అనంతపురంలో చేపట్టనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వహించనున్నట్లు వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. వైసిపి హయాంలో పేదలు ఉన్నత చదువులు అభ్యసించేందుకు భరోసా ఉండేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. ఫీజు బకాయిలు చెల్లించే విషయంలోనూ రాజకీయ కోణంలో చూస్తున్న పరిస్థితి ఉందన్నారు. వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలతోపాటు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు షేక్షావలి, ఎరుకుల అజయ్, తలారి చరణ్, మురళి, సల్ల మారుతి, పాతలింగ, శ్రీకాంత్, మల్లాపురం మల్లి, దొడగట్ట మహేష్, చిరు, తేజ, వంశీ, మంజు, ఎరుకల రమేష్, తలారి ప్రేమ్, రవీంద్రారెడ్డి, తిమ్మప్ప, వన్నూరుస్వామి, హనుమంతురెడ్డి, తేజ, రామాంజనేయులు, మేకల శీన, ఎంపిపి శివారెడ్డి, కెపి డొడ్డి సర్పంచు రమేష్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఉద్యమమే..

ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చక్రేనాయక్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్


బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రజా ప్రతినిధులు చేస్తున్న ప్రతిపాదలను ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చక్రే నాయక్ డిమాండ్ చేశారు. శనివారం 2వ రోడ్డులోని బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలు వెనుకబడిన వర్గాలుగా ఉన్నారని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో ప్రతిపాదించడాన్ని ఏఐబిఎస్‌ఎస్‌గా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలుగా అభివృద్ధి చెందిన వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చూడటం అన్యాయంగా ఉందన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఎస్ఎస్ నాయకులు ఎస్.బాలాజీనాయక్, కిరణ్‌నాయక్, కె.అశోక్‌నాయక్, బి.గోపాల్‌నాయక్, కె.రవిరామ్ నాయక్, సుగుణాబాయి, శివమణిబాయి, నాయకన్ చంద్రిబాయి, శేఖర్ నాయక్, రంగ్లా నాయక్, కృష్ణా నాయక్, చంద్రకళా బాయి తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

క్వాలిటీ స్క్రీన్ గార్డ్స్‌కు కేరాఫ్ 'బాచి'

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

సాధారణంగా లాప్‌టాప్, మొబైల్, కారు, బైకు, ఎలక్ట్రానిక్ వస్తువు ఏదైనా... క్వాలిటీ స్క్రీన్ గార్డ్స్ అనగానే అనంతపురంలో అందరి నోటా వినిపించేది 'బాచి'. ఈ పేరు వినగానే సాధారణంగా అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రయివేట్ సంస్థలు, వ్యాపార వాణిజ్య సంస్థలు అన్నిచోట్ల ఎలక్ట్రానిక్ వస్తువులకు బాచితోనే సంరక్షణ స్క్రీన్ గార్డ్స్ వేయించుకుంటారు. ఎంతో సుదీర్ఘకాలంగా అనంతపురంలోని సప్తగిరి సర్కిల్‌లో వైశ్య హాస్టల్ బిల్డింగ్‌లో శ్రీ విజయ దుర్గ స్టోర్స్ ద్వారా బాచి కుటుంబం ప్రజలకు సేవలు అందిస్తోంది. బాచి తండ్రి ఈశ్వరయ్య జనరల్ స్టోర్ ద్వారా మంచికి మానవత్వానికి పేరుగా నిలిచారు. తర్వాత టెక్నాలజీ పరంగా విజయ స్టోర్ మొబైల్స్, లాప్ టాప్స్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరింగ్ కేంద్రంగా పేరుగాంచింది. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో మొబైల్ కొనుగోలుదారులు ఎంతో ప్రీతిగా అత్యధిక ధరలు వెచ్చించి మొబైల్స్ లాప్టాప్స్ కొంటున్నారు. అయితే వాటి సంరక్షణ గాడ్స్ సరైన పద్ధతిలో వేయకుంటే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని బాధపడుతుంటారు. అలాంటి వారికి బాచి ఎంతో నేర్పరితనంతో స్క్రీన్ గార్డ్స్ వేస్తూ సంరక్షణ నాణ్యత కలగలిపి ఇస్తున్నాని చెబుతున్నారు. కస్టమర్ల ఆదరణ తమపై మరింత బాధ్యత పెంచుతుందని బాచీ తెలిపారు.



విజయదుర్గ స్టోర్స్, నిర్వాహకులు బాచి


శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు

స్వామిత్వ పథకంపై శిక్షణ

గుత్తి : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న స్వామిత్వ పథకంపై గుంతకల్లు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా డివిజినల్ పంచాయతీ అధికారి శివాజీరెడ్డి ఆధ్వర్యంలో శిక్షకులు హర్షవర్ధన్, రాఘవేంద్ర గ్రామ పంచాయతీలో సర్వే నిర్వహించి నివాసాలు, ఆలయాలు, పాఠశాలలు, మసీదులు, చర్చిలు, ఖాళీ స్థలాలను గుర్తించి రికార్డులో ఎలా నమోదు చేయాలన్న వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సాదిక్, ధనలక్ష్మి, ఎర్రిస్వామి, రాము, బాషా పాల్గొన్నారు.


మహాలక్ష్మిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుత్తి : మండలంలోని శ్రీపురం గ్రామంలో మహాలక్ష్మి దేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం వేకువజాము నుంచి అమ్మవారికి అర్చకులు హారతి, మహా మంగళ హారతి, అర్చన, గంగాజలాలతో అభిషేకాలు, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలి

అనంతపురం కలెక్టరేట్ : ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మెప్మా, బీసీ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని రజకనగర్, మారుతీ నగర్‌లో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ నేర్పించే కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు మూడు నెలల శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ విశ్వజ్యోతి, బిసి వెల్ఫేర్ ఈడి సుబ్రమణ్యం, మున్సిపల్ అధికారులు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, మాజీ కార్పొరేటర్ రాజారావు, బీసీ వెల్ఫేర్ అధికారి రాజు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, నాయకులు వడ్డే భవాని, మహేశ్వరి, సాకే లక్ష్మీనరసింహ, సైపుద్దీన్, నెట్టెం బాలకృష్ణ, వడ్డే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులు

యల్లనూరు : మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామంలో పులివెందుల ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు బాలాంజినేయులు ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 60 మందికి కంటి పరీక్షలు చేయగా 20 మందికి కంటి పొరలు పూర్తిగా దెబ్బతిన్నట్లు నిర్ధారించారు. వీరిని స్వయంగా ఐ కేర్ ఆసుపత్రికి ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వైద్యులు బాలాంజినేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గోల్డెన్ తాజ్‌లో రుచికరమైన హలీం

అధినేత సయ్యద్ అలీ

ప్రజాశక్తి-అనంతపురం

రంజాన్ మాసం పురస్కరించుకుని నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్న గోల్డెన్ తాజ్ రెస్టారెంట్‌లో రుచికరమైన హలీంను తయారు చేస్తున్నట్లు రెస్టారెంట్ అధినేత సయ్యద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా జిల్లా ప్రజలకు అనుభవమైన మాస్టర్లతో తయారు చేయిస్తున్న నాణ్యమైన రుచికరమైన చికెన్, మటన్ హలీంను అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ మాస్టర్లతో అద్భుతమైన రుచితో హలీం అందిస్తున్నట్లు చెప్పారు. రంజాన్ సందర్భంగా కుటుంబ సమేతంగా తినడానికి హలీం ఫ్యామిలీ ప్యాక్‌ను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఇదేవిధంగా రంజాన్ సందర్భంగా 'మంది బిర్యాని' ప్రత్యేకంగా అందిస్తున్నట్లు తెలిపారు.



గోల్డ్ తాజ్‌లోని హలీం సెంటర్, అధినేత సయ్యద్ అలీ

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలిసిన పుల్లారెడ్డి

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని శనివారం అంతపురంలోని క్యాంపు కార్యాలయంలో పుట్లూరుకు చెందిన పుల్లారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా పుట్లూరులో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేతో చర్చించారు. మండలానికి తాగునీటి సమస్యతోపాటు సాగునీటి సమస్య తీరాలంటే గండికోట ప్రాజెక్టు నుండి ఎత్తిపోతల పథకం కింద పైపులైన్ ద్వారా పుట్లూరు చెరువుకు సుబ్బరాయుడు సాగర్‌కు విడుదల చేయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పుల్లారెడ్డి తెలిపారు.


ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో పుల్లారెడ్డి

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతిచెందిన రవి

గుత్తి : మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ జాతీయ రహదారి పక్కన రవి అనే భవన నిర్మాణ కార్మికుడి మృతదేహం శనివారం లభ్యమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిల మేరకు.. మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని గమణించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి ప్యాంటు జేబులో ఉన్న ఓటరు కార్డును స్వాధీనం చేసుకున్న పోలీసులు మతుడు గుంతకల్లు పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన బి.రవి (38)గా గుర్తించారు. కుటుంబ సభ్యులను ఆరాతీయగా రవి శుక్రవారం రాత్రి 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు. రవి బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. గుత్తిలో బండగేరికి చెందిన మణితో పదహారేళ్ల క్రితం వివాహమైందని, అయితే ఐదు నెలల క్రితం భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారు గొలుసు అపహరణ

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును శనివారం వేకువజామున గుర్తు తెలియని దుండగుడు అపహరించాడు. బాధితురాలు తెలిపిన వివరాలిలా మేరకు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి వేకువజామున ఇంటి బయట పనులు చేసుకుంటోంది. అయితే ఒక్కసారిగా ఓ గుర్తు తెలియని వ్యక్తి లక్ష్మీదేవిపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరిగెత్తాడు. మహిళ బిగ్గరగా కేకలు వేయడంతోవిషయం తెలుసుకున్న కొందరు గ్రామస్తులు దొంగను పట్టుకునేందుకు వెంబడించారు. అయితే దొంగ గ్రామస్తులకు దొరకకుండా పారిపోయాడు. మహిళ మెడలోని గొలుసును దొంగలాగిన సమయంలో సగం తెగిపోయి అక్కడే పడిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. దొంగ అనవాళ్లను మహిళను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైళ్లలో చోరీకి పాల్పడే దొంగ అరెస్టు


గుంతకల్లు : రైళ్లలో ప్రయాణికుడిలా తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారం–7లో శనివారం అరెస్టు చేసి రూ.79వేలు విలువజేసే బంగారు డాలరు, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నట్లు జిఆర్‌పి డీఎస్పీ అజయకుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక రైల్వే స్టేషన్‌లోని జిఆర్‌పి స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిఆర్‌పి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైళ్లలో చోరీల నియంత్రణలో భాగంగా ఎస్సీ మహేంద్ర, అర్పీఫ్ సిబ్బంది కోఆర్డినేషన్‌తో స్థానిక రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న గుంటూరుకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేసి బంగారు డాలారు, వెండి పట్టీలు, సెలఫోన్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దుకాణాల్లో చోరీ


అనంతపురం క్రైం : రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్ వద్ద ఉన్న నాలుగు దుకాణాల్లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రూరల్ సీఐ శేఖర్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు దుకాణాల షట్టర్లు తొలగించి క్యాష్ బాక్స్ లో ఉన్న నగదు, సిగరెట్లు ఎత్తుకెళ్లారు. దుకాణాల యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇది చిల్లర దొంగల పనేనని త్వరలో దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

కలుషిత నీరు తాగి 32 జీవాలు మృతి

నార్పల : మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో కలుషిత నీరు తాగి గొరవ గంగప్పకు చెందిన 32 జీవాలు మృత్యువాత పడ్డాయి. బాధిత కాపరి తెలిపిన వివరాల మేరకు.. తనకున్న మేకలను ఉదయం మేతకు తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో మధ్యాహ్నం ఓ చేనులని 45 రోజుల జొన్నచొప్పను మేపారు. దీంతోపాటు అక్కడే డ్రిప్‌ల్లో మందు కలిపిన నీటిని తాపాడు. దీంతో విషం ఎక్కి దాదాపు 32 మేకలు మృతిచెందినట్లు వాపోయాడు. మరో 15 మేకలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మృతిచెందిన గొర్రెలు, మేకల విలువ దాదాపు రూ.1.50లక్షలు ఉంటాయన్నారు. సమాచారం అందుకున్న వెటర్నరీ డాక్టర్ గోవిందారజు వచ్చి వైద్యం చేసినా ఫలితం దక్కకుండా పోయిందన్నారు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.


మృతిచెందిన మేకలు

బీర పంట ధ్వంసం


ధ్వంసమైన బీర తోటను పరిశీలిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని గొళ్ల గ్రామానికి చెందిన రైతు బోయ చంద్రశేఖర్‌కు చెందిన బీర తోటను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. తనకున్న మూడెకరాల పొలంలో బీర పంట చేసి పందిరి ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇందుకు దాదాపు రూ.3లక్షల వరకూ పెట్టుబడి అయిందన్నారు. ఈనేపథ్యంలో రాత్రి గుర్తు తెలియని దుండగులు బీరకు వేసిన పందిరితోపాటు పంటను ధ్వంసం చేసినట్లు వాపోయాడు. పంట చేతికి వచ్చి ఉంటే సుమారు రూ.9లక్షల వరకూ ఆదాయం వచ్చేందన్నారు. పోలీసులు స్పందించి పంటను నాశనం చేసిన దుండగులను పట్టుకుని శిక్షించాలన్నారు. అలాగే ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

ప్రపంచ మహిళా దినోత్సవంలో వక్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమాజంలో మహిళల పాత్ర కీలకమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం జిల్లావ్యాప్తంగా ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ పార్టీలు, సంఘాలు, కార్యాలయంలో కేక్‌లు కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్ పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఎంతో అభివృద్ధి, పురోగతిని సాధించారన్నారు. అన్నిరంగాల్లో సాధికారత దిశగా పయనిస్తుండటం హర్షణీయమన్నారు. మహిళల్లో శక్తి సామర్థ్యాలు మెండుగా ఉంటాయన్నారు. ఏ పోటీ పరీక్షల్లో చూసినా మహిళల ప్రతిభ అధికంగానే ఉంటుందన్నారు. మహిళల్లో ఓర్పుతో పాటు పట్టుదల కూడా అధికంగా ఉంటుందన్నారు. అనంతరం వారం రోజుల నుంచి జిల్లాలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కాగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ హెడ్ క్వార్టర్స్ ముఖ ద్వారం, ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్, అంబేద్కర్ కూడళి, వై జంక్షన్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ సాగింది. ఆయా కార్యక్రమంల్లో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిఆర్‌టియు నగర మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి అధ్యక్షతన వివిధ రంగాల్లో సేవలు అందించిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పురుషోత్తంరెడ్డి, తిమ్మారెడ్డి, రాష్ట్ర పత్రిక సంపాదక వర్గ సభ్యులు ఎ.కేశవరెడ్డి, జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, నాయకులు చిత్తంబర్‌రెడ్డి, వేమారెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకటేష్, రమణారెడ్డి, జయప్రకాష్, వసంత్‌రెడ్డి, రామాంజినరెడ్డి, రవీంద్రారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక రుద్రంపేట రోడ్డులోని పివికెకె ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళా అధ్యాపకులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు మహిళా సాధికారత విభాగ డైరెక్టర్, ఆంగ్ల ఆచార్యురాలు ప్రొఫెసర్ విబి.చిత్ర, కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.దీప్తి జోర్దానా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.మనోహర్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ ఎ.పావని, కో-కన్వీనర్ వై.మమత, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠవాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, ప్రిన్సిపాల్ జి.లావణ్యారామ్, మమత శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి అన్నారు. మహిళలకు సహకరిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కావున కేవలం మహిళా దినోత్సవం రోజున మాత్రమే మహిళలను ప్రోత్సహించకుండా భవిష్యత్తులో సహకారం అందిస్తే అన్నిట్లో రాణిస్తారన్నారు.

అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాళ్లు స్వప్న, సంగా తేజస్విని, సరళ, భూలక్ష్మి, వడ్డే భవాని, చరిత, అలివేలమ్మ, నాయుడమ్మ, మహేశ్వరి, కంఠదేవి, సుమలత, మాధవి, హసీనాబాను, దలవాయి రమాదేవి, అయేషా, బిజెపి రాష్ట్ర మహిళా నాయకులు చంద్రకళ, ప్రత్యూష, స్వాతి, జనసేన మహిళా నాయకులు మహాలక్ష్మి, శరణ్య, మంజుల, ఎంఆర్‌పిఎస్ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు స్వతంత్ర కుమారి, తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో మహిళలతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

నగరంలోని బృహస్పతి విద్యానికేతన్ స్కూల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శశికళ, కరెస్పాండంట్ రవి శంకర్‌ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులో ఉన్న సుబ్బయ్య మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లాయర్ పద్మ నారాయణరెడ్డి, కళ్యాణదుర్గం ఎంఇఒ విజయకుమారి, ఉమెన్ సెల్ అధ్యక్షురాలు శ్రీదేవి, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ పద్మావతి, సుబ్బయ్య మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పిడుగు అపర్ణ, కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మంగళకుంట నాగరాజు, ఓబులేసు, దండు వెంకటరాముడు, రామకృష్ణ, చిట్రా సూర్యనారాయణ, బికె నారాయణ, శంకర్, నాగలింగం, అశోక్, పిడుగు ఆదిత్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తున్నారన్నారు. కావున మహిళలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహాన్ని అందించి అన్నిరంగాల్లో సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం పాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, డెమో త్యాగరాజ్, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు అవరణలో డిఎంహెచ్ఒ ఇబి.దేవిని జడ్జి శ్రీనివాస్, కలెక్టర్ వినోద్‌కుమార్ ఘనంగా సత్కరించారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని లలిత కళా పరిషత్ జనరల్ సెక్రటరీ అడ్వకేట్ పద్మజ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ సమస్యలు ఎదురైనా మహిళలు ధైర్యంగా ఎదుర్కొంటూ విజయకేతనం ఎగురవేస్తున్నారన్నారు. మహిళ గృహిణిగా, తల్లిగా, సోదరిలా అనేక బాధ్యతలు పోషిస్తూ, ఉద్యోగ వ్యాపారరంగాల్లో కూడా తమ ప్రతిభను చాటుకుంటున్నారు. అలాంటి మహిళలకు ప్రోత్సాహం అందిద్దామని పిలుపునిచ్చారు.

అనంతపురంలోని ఆర్టీసీ ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ అధికారి సుమంత్ ఆర్ ఆథోని, అడ్వకేట్ పద్మనారాయణరెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.శ్రీలక్ష్మి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ మేనేజర్ పి.రమేష్‌బాబు, లా ఆఫీసర్ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ లక్ష్మీదేవి, పర్సనల్ ఆఫీసర్ డి.చంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అనూరాధ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మిప్రసాద్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ శివయ్య ఆచారి, మురళి, రాష్ట్ర కౌన్సిలర్, రాష్ట్ర మున్సిపల్ కమిటీ కన్వీనర్ ఫణిభూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి వి.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి జి.మల్లిఖార్జున, గంగాధర్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని తపోవనం పద్మశాలి కళ్యాణ మండపంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, గండాబదుల సుజాత, సరళ, కొంతం శివరుద్ర, తాడూరు చంద్రశేఖర్, గుర్రం యుగంధర్, దేవరకొండ నరసింహులు, జానపాటి సత్యనారాయణ, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక రుద్రంపేటలోని మను మినీ ఫంక్షన్ హాల్‌లో బచ్‌పన్ స్కూల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, బచ్‌పన్ స్కూల్ డైరెక్టర్ గాంధీ, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఫాతిమా, రాధా, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మహిళలతో కలిసి కేక్ కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ,వైసీపీ మహిళా విభాగం నేతలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం, ప్రజావేదిక వద్ద మెప్మా ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఘన నివాళి అర్పించి, మహిళలతో కలసి ఎమ్మెల్యే సురేంద్రబాబు మహిళలకు శు భాకాంక్షలు తెలిపారు

పుట్లూరు : అనంతపురంలోని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహినంచారు. ఇందులో భాగంగా కేక్ కోశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టిడిపి సీనియర్ నాయకురాలు బండారు లీలావతి, నియోజకవర్గంలోని మహిళలు పాల్గొన్నారు

శింగనమల : మండలంలోని చిన్నమట్లగొంది సమీపంలో ఉన్న సంజీవరాయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘంనగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పార్నపల్లి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పురపాలక సంఘం కార్యాలయం నుంచి వినాయక కూడలి వరకూ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్, వార్డు సభ్యులు శారద, శ్రీలక్ష్మి, నసీమ, ప్రశాంతి, జ్యోతి, గోవిందరాజులు, సంజీవప్ప, చన్నవీరస్వామి, వైసిపి నాయకులు శివ, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీగా వచ్చి స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత, ఎఎన్ఎం లీలావతి, విజయలక్ష్మి, టీచర్లు లక్ష్మీదేవి, ముత్యాలమ్మ, సావిత్రమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, ప్రతి మహిళ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి ఎన్నో విజయాలు సాధించాలని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కుసుమాంజలి, జూనియర్ సివిల్ జడ్జి శ్వేత, ఏపీ మహిళ కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుకియా బేగం అన్నారు. శనివారం పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసి పంచిపెట్టారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ బి.జబ్బర్‌మియా ఆధ్వర్యంలో, శాంతిప్రియ ఆసుపత్రిలో డాక్టర్ ఎం.శాంతిప్రియ ఆధ్వర్యంలో, జడ్ వీరారెడ్డి కాలనీలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, ఐద్వా మండల అధ్యక్షురాలు కవిత, సహాయ కార్యదర్శి రేవతి ఆధ్వర్యంలో, పెన్షనర్ల భవనంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ఉరవకొండ : పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం మహిళలను పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లలిత, పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు నిరంజన్ గౌడ్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : గ్రామ స్వరాజ్య సంస్థ, ఇన్ఫిన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గంగవరం గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సేవాసంఘం అధ్యక్షులు చల్లా కిషోర్ చౌదరి, మదర్‌థెరిస్సా సేవాసంఘం అధ్యక్షురాలు సెలీనా చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు తిప్పయ్య, ఇన్ఫిన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ మహేష్‌కుమార్, గ్రామ స్వరాజ్య సంస్థ ప్రెసిడెంట్ కొప్పుల సుధాకర్, డైరెక్టర్ శైలేంద్రకుమార్, ఇన్ఫిన్స్ వ్యవస్థాపకులు విజయకిషోర్, వన్నూరుస్వామి, జిఎస్ఎస్ వ్యస్థాపక అధ్యక్షులు తిప్పేస్వామి నాయక్, సిరాజ్‌బేగం, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.



టిడిపి కార్యాలయంలో కేక్ కోస్తున్న నాయకులు